# ప్రజానిత్యావసరాలు అందించేందుకే ప్రజారైతుబజార్లు



పెనమలూరు ఫిబ్రవరి5,ప్రభాతవార్త : ప్రజలకు నిత్యావసరాలు అందించేందుకే రైతుబజార్లు ఏర్పాటు అని విమర్శించే నోటికి ప్రజలే సమాధానం చెప్తారని పెనమలూరు ఎమ్మెల్యే బోడేప్రసాద్ అన్నారు.పెనమలూరు నియోజకవర్గం తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని కానూరు, మురళీనగర్‌లో ప్రజల సౌకర్యార్థం ప్రజారైతుబజారు ఏర్పాటుచేసి గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారైతుబజారు ఏర్పాటుద్వారా వందలాది మంది పేదవర్గాల వారికి ఉపాధిద్వారా ఆర్థికచేయూత అందించగలుగుతామని తెలిపారు.3లక్షలకు పైగా నివాసాలు కలిగిన ఈ ప్రాంతంలో ప్రజలకు కూరగాయలు,నిత్యావసరాలు అందుబాటులో ఉంటాయని సూచించారు.తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో రవాణాసౌకర్యం నివాసానుకూలమైన గ్రామం కావడంతో గన్నవరం,విజయవాడ నియోజకవర్గాల్లో ఉద్యోగస్తులు ఎక్కువమంది నివాసాలు ఏర్పాటుచేసుకున్నారని ప్రజారైతుబజారు చేరువచేయడంతో ప్రజలకు వెసులుబాటు కలుగుతుందని స్పష్టం చేసారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేంద్ర బడ్జెట్‌లో దళిత ఆదివాసీలకు మొండిచేయి

పెనమలూరు ఫిబ్రవరి5,ప్రభాతవార్త : కేంద్రబడ్జెట్‌లో దళిత ఆదివాసీలకు కేంద్రప్రభుత్వం మొండిచేయి చూపించిందని,సబ్ కా సాత్ సబ్ కా వికాస్ బడ్జెట్లో కూడా నిర్లక్ష్యానికి గురయ్యారని దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు తెలిపారు.కేంద్రబడ్జెట్ దళిత ఆదివాసీల అభివృద్ధి కేటాయింపులపై గురువారం యనమలకుదురులోని డి.బి.ఎస్.యు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ కేంద్రప్రభుత్వం 2026-27 వార్షిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన మొత్తం బడ్జెట్ 53,47,315కోట్లలో అన్నివర్గాల అభివృద్ధికోసం కేటాయించబడిన బడ్జెట్ 16,67,947కోట్లలో ఎస్సీలకు జనాభా




నిష్పత్తి ప్రకారం 2,39,608కోట్లు కేటాయించాల్సి ఉండగా 1,96,400కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకుందని తెలిపారు.కేటాయించిన ఈ నిధుల్లో 75,077కోట్లు మాత్రమే నేరుగా ఎస్సీలకు ఉపయోగపడే పథకాలకు ఇచ్చి సుమారు 1,2,323కోట్లు ఎస్సీలకు పూర్తిగా ఉపయోగపడని పథకాలకు కేటాయించి తీవ్ర అన్యాయం చేసారన్నారు.ఎస్టీలకు కేటాయించిన 1,41,089కోట్లులో 62,093కోట్లు నేరుగా ఉపయోగపడని పథకానికి ఇచ్చి సుమారు 78,996కోట్లు నిధులు వేరే పథకాలకు ఇవ్వడం సబ్ కా సాత్ సబ్ కా వికాస్ లో దళిత ఆదివాసీల అభివృద్ధిని శూన్యం చేసిందన్నారు.అదీవాసీల్లో అత్యంత వెనుకబడిన పివిటిజి గ్రూపుకు నిధులు కేటాయించలేదని తెలిపారు.వీరిలో నెమడిక్ ట్రైబ్ గ్రూపులకు స్వల్పంగా 30కోట్లు కేటాయించి గతంలో ఉన్న ప్రధానమంత్రి బాలికల వసతిగృహాల పథకము పూర్తిగా తొలగించేసారని ఆవేదన వ్యక్తం చేసారు.నీతిఆయోగ్ ఆదేశాల ప్రకారము జనాభా నిష్పత్తి ప్రకారం నిధులు కేటాయించకపోవడమే కాకుండా తప్పనిసరిగా నిధులు కేటాయించాల్సిన 45ప్రభుత్వ శాఖలకు గాను 8శాఖలు పూర్తిగా నిధులు కేటాయించకపోవడం దళిత ఆదివాసీల అభివృద్ధి ప్రశ్నార్థకమేనని ఇప్పటికైనా ప్రభుత్వం జనాభా నిష్పత్తి ప్రకారం నిధులు కేటాయించాలని ,నిధులు100% వినియోగించాలని డిమాండ్ చేసారు.అనంతరం ఆదివాసీల బడ్జెట్ ఎనాలసిస్ నివేదికను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సి.హెచ్ బంగారురాజు,గిరిథర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# రోజు రోజుకి మితిమీరుతున్న రేషన్ మాఫియా ఆగడాలు...

నందిగామ ఫిబ్రవరి 05 ప్రభాతవార్త ప్రతినిధి: నందిగామ నియోజకవర్గం పరిధిలోని మండల్లాల్లో రేషన్ మాఫియా ఆగడాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఈ నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాల్లో పగలు రాత్రి అనే తేడా లేకుండా భారీ వాహనాల ద్వారా పేదల రేషన్బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందుతోంది. రేషన్ షాపుల నుండి డీలర్ల సహకారంతో పేదలబియ్యాన్ని కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాదు. ఈ రేషన్ మాఫియావెనుక అధికార కూటమి పార్టీకి చెందిన ముఖ్య నాయకులు ఉన్నట్లు సమాచారం. నాలుగు మండలాల్లో రేషన్ మాపియా నిర్వాహకులు సంబంధిత అధికారులకు నెలవారీ మామూళ్లుముట్టజెప్పుతున్నట్లు బహిరంగంగా చెబుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇంకా, పేదల బియ్యం కొనుగోలు చేసిన వారిపై సమాచారం ఇస్తే, తరువాత ముడుపులు తీసుకుని చిన్నచిన్న వ్యాపారులు, పేదలపైనే కేసులు నమోదు చేయించి అసలు మాఫియా నిర్వాహకులను తప్పించేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ అధికారులు వెంటనే స్పందించి, రేషన్ మాఫియా దారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.




# జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ చేసిన విప్ తంగిరాల సౌమ్య

నందిగామ ఫిబ్రవరి 5 ప్రభాతవార్త ప్రతినిధి: నందిగామ పట్టణ పరిధిలో గల జిల్లా పరిషత్ హై స్కూల్‌లో గురువారం జాతీయ అంధత్వ మరియు దృష్టిలోప నివారణ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నేతలతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, దృష్టిలోపం ఉన్న విద్యార్థిని విద్యార్థులకు కళ్లజోళ్లను ఎమ్మెల్యే పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, చిన్న వయసులోనే కంటి సమస్యలను గుర్తించి చికిత్స అందిస్తే భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను నివారించవచ్చని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్య రెండూ సమానంగా ముఖ్యమని, ముఖ్యంగా దృష్టిలోపం కారణంగా చదువులో వెనుకబడకుండా కూటమి ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలు అందించడమే ప్రధాన లక్ష్యమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు, కూటమి నేతలు కీలక పాత్రపోషించారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ మల్లెపాక శ్రీనివాసరావు, హాస్పిటల్ కమిటీ ఛైర్మన్ వేపూరి నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వైద్యులు, కూటమి నాయకులు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# దుర్గగుడిలో సిబ్బందిపై రాజ్యాంగేతర శక్తి చర్య హేయం

ఎ కొండూరు, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం రేపూడి గ్రామానికి చెందిన విజయవాడ కనకదుర్గ గుడి బోర్డు సభ్యురాలైన తరిగొప్పుల పార్వతి భర్త రాజ్యాంగేతర శక్తి తరిగొప్పుల హుస్సేన్ దుర్గమ్మ దర్శనానికి వచ్చిన 6గురు వ్యక్తులకు కండువా వేయలేదనే అక్కసుతో దుర్గగుడి సిబ్బందిని దుర్భాషలాడి అవమానపర్చడం, గుడిలో అసభ్య ప్రవర్తనతో భక్తుల



మనోభావాలను దెబ్బతీయడం తిరువూరు నియోజకవర్గం తిరువూరు ఎ కొండూరు విసన్నపేట గంపలగూడెం మండలాలకు చెందిన భక్తులు నియోజకవర్గ ప్రజలు తీవ్రంగా ఆక్షేపించారు. గతంలో హుస్సేన్ దంపతులపై గృహహింసకు సంబంధించిన కోడలి హత్యయత్న కేసులో నిందితురాలిగా ఉన్న పార్వతిని దుర్గగుడి బోర్డు సభ్యురాలిగా నియమించడం పట్ల ప్రభుత్వ వైఖరిని నియోజకవర్గ ప్రజలు భక్తులు విమర్శలు చేస్తున్నారు. ఆలయం ప్రాంగణంలో భక్తులతో క్రమశిక్షణగా గౌరవంగా ప్రవర్తించవల్సిన బోర్డు సభ్యురాలి భర్త రాజ్యాంగేతర శక్తిగా ఉన్న తరిగొప్పుల హుస్సేన్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకుని కారణమైన ట్రస్టు బోర్డు సభ్యురాలిని వెంటనే రాజీనామా చేయించి భక్తుల మనోభావాలు దుర్గగుడి ప్రతిష్టను కాపాడాలని ప్రజలు భక్తులు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

# అమరావతి సదస్సులో ఆంజనేయులు



ఎ కొండూరు, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :అమరావతి పరేడ్ గ్రౌండ్స్ వేదికగా గురువారం సిఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన నీరు ప్రగతి జలహారతి సాగునీటి సంఘాల భాగస్వామ్యం సంఘాల చైర్మన్‌ల సదస్సుకు ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం చీమలపాడు సాగునీటి సంఘం ఛైర్మన్ పాగాల ఆంజనేయులు (అంజి) పాల్గొన్నట్లు గురువారం "ప్రభాతవార్త"కు తెలిపారు. ఈ సదస్సులో రాష్ట్రంలోని 6047 సంఘాలు 58 ప్రాజెక్ట్ కమిటీలు, 267 డిస్ట్రిబ్యూటరీ కమిటీల చైర్మన్‌లు పాల్గొన్నారని, పాగాల అంజి తెలిపారు.

# విజయవాడ వార్త



## నగరాభివృద్ధిలో రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ పాత్ర కీలకం : కమీషనర్ ధ్యానచంద్ర



విజయవాడ కార్పొరేషన్,ఫిబ్రవరి 5,ప్రభాతవార్త:ది నగరాభివృద్ధిలో రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ పాత్ర కీలకమని,ఆ ప్రాంతాలలో ఉన్న సమస్యలను తెలియచేయాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. గురువారం ఉదయం ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ఆయన రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫెడరేషన్ మెంబర్స్‌తో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నగర పరిధిలోని వెల్ఫేర్ అసోసియేషన్ ఉన్న ప్రాంతాలలో గల సమస్యలను తెలియచేయాలని ప్రతి చిన్న సమస్యనైనా క్షేత్రస్థాయిలో వారే చూడగలరని కావున నగరాభివృద్ధికి వారు కూడా సహకరించాలన్నారు. అసోసియేషన్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ వి.వెంకటేశ్వరరావు,సెక్రటరీ కెజీ రామారావు,సభ్యులు పాల్గొన్నారు.

## నగర పరిధిలో యాంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహించాలి

విజయవాడ కార్పొరేషన్,ఫిబ్రవరి 5,ప్రభాతవార్త: నగర పరిధిలో యాంటీ లార్వా ఆపరేషన్లను విస్తృతంగా నిర్వహించాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర సిబ్బందిని ఆదేశించారు. గురువారం నగర పర్యటనలో భాగంగా ఆయన విశాలాంధ్ర రోడ్డు,మధురానగర్,రామకృష్ణాపురం,గులాబీతోట ప్రాంతాలను ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన దోమల నియంత్రణకు విస్తృతమైన చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు దోమల వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా దోమలను నియంత్రంఇచే చర్యలను తీసుకోవాని, కేవలం మలేరియా సిబ్బందినే కాకుండా పూర్తిఆ ప్రజారోగ్య శానిటరీ ఇనస్పెక్టర్లను కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. నగర పరిధిలోని డ్రైన్‌లలో పూడికలు తీయాలని, బందర్,రైవస్,ఏలూరు,బుడమేరు కాలువల్లో నగరప పరిధలో గల కృష్ణానదిలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని,నగర శివార్లలో కూడా వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేటట్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు సైడ్ కాల్వలో బందర్,రైడస్,కాలువల్లో కృష్ణానదిలో వ్యర్థాలను వేయకుండా,నగరపాలక సంస్థ వారు చేసే చర్యలకు సహకరించి, వ్యర్థాలకు కేవలం పారిశుధ్య కార్మికుల వారికి మాత్రమే ఇవ్వాలన్నారు.ప్రజారోగ్య సిబ్బంది కూడా ప్రజలకు మైకుల ద్వారా ప్రచారం చేసి అవగాహన కల్పించాలన్నారు. తదుపరి రాణీగారితోట అన్నా క్యాంటీన్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి,ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కల్గకుండా త్రాగునీరు,వాడుక నీటి సరఫరాలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని,క్యాంటీన్‌లో పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదని ఎప్పటికప్పుడు ఏమైనా మరమ్మత్తులుంటే వెంటనే చేయంచాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ హెల్త్ అసిస్టెంట్ డాక్టర్ కె.అర్జునరావు,చీఫ్ ఇంజనీర్ ఇన్‌ఛార్జి పి.సత్యకుమారి, జోనల్ కమీషనర్ ప్రభుదాస్,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.శ్రీనివాస్ రెడ్డి,అసిస్టెంట్ సిటీ ప్లానర్ జగదీష్,అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ అన్నపూర్ణ,సిబ్బంది పాల్గొన్నారు.



## 10వ రోజు ఘనంగా సైకిల్ యాత్ర

విజయవాడ కార్పొరేషన్,ఫిబ్రవరి 5,ప్రభాతవార్త: డ్రగ్స్‌పై దండయాత్ర 10వ రోజు కార్యక్రమంలో భాగంగా సైకిల్ యాత్ర గురువారం నున్న పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమం వాంబే కాలనీ జి బ్లాక్ వద్ద నుండి జీవితాన్ని ప్రారంభించు-డ్రగ్స్‌కు దూరంగా ఉండు అనే నినాదంతో సుమారు 200 మంది విద్యార్థులు సైకిల్ తొక్కుతూ యాత్రను ప్రారంభించారు. సింగ్‌నగర్ పోలీసులు దండయాత్రనే వాంబే కాలనీ జి బ్లాక్ వద్దకు రాగా నున్న పోలీస్ స్టేషన్ వారు డప్పులు,సన్నాయిలతో స్థానిక మహిళలు ఘనంగా పూలు జల్లుతూ హారతులు ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. గురువారం కూడ పోలీస్ కమీషనర్ రాజశేఖరబాబు,ఎంఎల్ఏ బోండా ఉమామహేశ్వరరావు,ఈగల్ ఐజి ఆకే రవికృష్ణలు ముఖ్య అతిథులుగా పాల్గొని అవగాహన కల్పించారు.ఏడిసిపి జి.రామకృష్ణ పర్యవేక్షణలో నార్త్ ఎసిపి స్రవంతి రాయ్,సిఐ కృష్ణమోహన్ వారి సిబ్బందితో ఘనంగా ఏర్పాట్లు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డ్రగ్స్‌పై ఎటువంటి సమాచారాన్నైన 112కు గాని, 1972కు గాని తెలియచేయాలని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఇండ్లాస్ శాంతివనం డాక్టర్ ఆశిష్,స్థానిక కార్పొరేటర్ దుర్గ,నేతలు,ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ అరవ రమేష్,పెద్ద ఎత్తున స్థానిక మహిళలు విద్యార్థులు పాల్గొన్నారు.



## తక్కువ ధరకే నాణ్యమైన ఆహారం అందించమే ముఖ్యం : జోనల్ కమీషనర్ షమ్మీ

విజయవాడ కార్పొరేషన్,ఫిబ్రవరి 5,ప్రభాతవార్త: అన్నా క్యాంటీన్ ద్వారా పేదలు,కూలీలు,అవసరమైన వారికి తక్కువ ధరకే నాణ్యమైన ఆహారం అందించడమే ముఖ్యమని జోనల్ కమీషనర్-3 కె.షమ్మీ పేర్కొన్నారు. గురువారం ఆయన రాణీగారితోట లోని అన్నా క్యాంటీన్‌ను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌లో అందిస్తున్న ఆహారనాణ్యత,వంట విధానం,సరఫరా విధానం,సేవా సౌకర్యాలు,పరిశుభ్రత,త్రాగునీటి వసతి తదితర అంశాలను సవివరంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార తయారీ నుండి వడ్డింపు వరకు అన్ని దశల్లో శుభ్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని అధికారులకు సూచించారు.అన్నా క్యాంటీన్‌లో ఎలాంటి లోపాలు తలెత్తకుండా తమ విభాగం తరచూ తనిఖీలను నిర్వహిస్తుందని,ఆహార నాణ్యత,సేవలపై నిరంతరంగా పర్యవేక్షణ చేస్తామని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కల్గకుండా అన్ని ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.



## 7న గుంటుపల్లిలో జాబ్ మేళా

విజయవాడ తూర్పు, ఫిబ్రవరి 5(ప్రభాతవార్త) : జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు గాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపిఎస్ఎస్ డిసి), ఎన్టీఆర్ వికాస, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డి ఆర్ డి ఎ సీడాప్ సంయుక్త ఆధర్యంలో ఈ నెల 7వ తేదీన శనివారం నాడు ఉదయం 9 గంటలకు ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లిలోని జిల్లా పరిషత్ హైస్కూలులో జాబ్ మేళా" నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సి. మధుభూషణ్ రావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.

## లాటరీ ద్వారా బార్ల కేటాయింపు

విజయవాడ తూర్పు, ఫిబ్రవరి 5(ప్రభాతవార్త ) : నూతన మద్యం పాలసీ (202528) ప్రకారం జిల్లాలో అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో లాటరీ ద్వారా బార్ల కేటాయింపు జరుగుతోందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాసరావు తెలిపారు. బార్ల కేటాయింపునకు లాటరీ ప్రక్రియ గురువారం విజయవాడ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా అబ్కారీ మరియు మద్య నిషేధ శాఖ ఆధ్వర్యంలో జరిగింది. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీ ృశ ప్రత్యక్ష పరిశీలనలో ఈ ప్రక్రియ నిర్వహించారు.

## నేడు మాజీ సిఎం జగన్ పర్యటన విజయవంతంకై ర్యాలీ..

ఎ కొండూరు, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :వైసిపి అధినేత మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పర్యటన జయప్రదం చేయాలని స్టేట్ గ్రీవెన్స్ సెల్ జనరల్ సెక్రటరీ నరెడ్ల వీరారెడ్డి, జిల్లా బిసి సెల్ ఉపాధ్యక్షుడు కాలసాని చెన్నారావు (రాద్దు) ఎ కొండూరు మండల వైసిపి వర్కింగ్ ప్రెసిడెంట్ అత్తునూరి వెంకటరెడ్డి గురువారం వేరువేరు ప్రెస్‌మీట్లలో పిలుపునిచ్చారు. మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటిపై టిడిపి గూండాల పెట్రోల్ బాంబుల దాడి, ఇంటికి నిప్పు పెట్టి జోగి రమేష్‌ను హత మార్చాలనే కుట్రలో భాగమే ఈ దాడి అని ఈ దాడి మంత్రి లోకేష్ బాబు ఆదేశాల మేరకే జరిగిందని టిడిపి గూండాల దాడి అప్రజాస్వామికమేనని, ఇటువంటి దాడులతో వైకాపా శ్రేణులను నాయకులను కార్యకర్తలను భయబ్రాంతులు చేయాలని చూడటం సూర్యుడుపై ఉమ్మి వేయడమేనని వీరారెడ్డి చెన్నారావు (రాద్దు) వెంకటరెడ్డి తెలిపారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలో వైఎస్ జగన్ పర్యటన జయప్రదం చేసేందుకు తిరువూరు ఎ కొండూరు గంపలగూడెం విసన్నపేట నుండి పార్టీ శ్రేణులు నాయకులు కార్యకర్తలు అనుబంధ శ్రేణులు జడ్పీటిసి ఎంపిటిసి మెంబర్లు సర్పంచ్‌లు మాజీ ప్రజా ప్రతినిధులు అభిమానులు సానుభూతిపరులు అధిక సంఖ్యలో పాల్గొని కూటమి ప్రభుత్వం కళ్ళు తెరిపించాలని వీరు కోరారు.

## 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలి



ఎ కొండూరు, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలం పెద్ద తండా ఎస్‌సి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను డైట్ లెక్చరర్ మిరియాల బోసుబాబు గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఈ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1 నుండి 5వ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్న ప్రతి విద్యార్థి తెలుగు ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో చూసి చదవడం రాయడం రావాలని అదే విధంగా గణితం సబ్జెక్‌లో కూడికలు, తీసివేతలు గుణకారాలు మరియు భాగాహారాలు అనగా చతుర్విధ ప్రక్రియలు ప్రతి విద్యార్థి నేర్చుకోవాలని 75 రోజుల్లో యాక్షన్ ప్లాన్‌తో జిఎఫ్ఎల్ ఎన్ (గ్యారెంటీ ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ) కార్యక్రమం అమలు జరుగుతున్న విధానంపై పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేస్తూ నూరు శాతం అమలుకు కృషి చేయాలని ఉపాధ్యాయులు కృషి చేయాలని డైట్ లెక్చరర్ మిరియాల బోసుబాబు ప్రశంసించారు. కంభంపాడు జడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. 10వ తరగతిలో 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను ప్రతి ఒక్క విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం అందచేసిన స్ఫూర్తి మెటీరియల్‌లో ఇచ్చిన ప్రతి ప్రశ్న జవాబును జాగ్రత్తగా చదువుకొని రివిజన్ చేస్తూ నూరుశాతం ఫలితాలు సాధించాలని కోరారు. డొక్క సీతమ్మ మధ్యాహ్న భోజనం పరిశీలించి రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్ఎంలు జ్యోతి ఇన్‌చార్జ్ హెచ్ఎం రాజారావు, బేబి క్రాంతి, సిబ్బంది పాల్గొన్నారు.

## పలు సమస్యలపై మంత్రి ఎన్ఎండి ఫరూక్‌కి వినతి




తిరువూరు, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ ఇన్‌స్పెక్టర్ మరియు జిల్లా హజ్ సొసైటీల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర న్యాయ శాఖ మరియు మైనారిటీ వెల్ఫేర్ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ని, రాష్ట్ర కమిటీ డైరెక్టర్ అబ్దుల్ హుస్సేన్ కలిసి పలు సమస్యలపై మంత్రికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ షేక్ హాసన్ భాష ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫరూక్ షుబ్లీ మరియు హజ్ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

తిరువూరు, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, రైతులకు మద్దతు ధర ఇవ్వాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలు పోరాడి సాధించుకున్న హక్కులను యధావిధిగా కొనసాగించాలని తదితర డిమాండ్లతో 12వ తేదీన జరగనున్న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సిపిఎం, సిపిఐ నాయకులు పిలుపునిచ్చారు.సమ్మె జయప్రదం చేసేందుకు ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తల సమావేశం తిరువూరులోని సిపిఐ కార్యాలయంలో జరిగింది.ఈ క్రమంలో సమ్మె గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ క్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు ఎస్.నాగేశ్వరరెడ్డి, ఎస్వీ భద్రం, సాంబారు వెంకటేశ్వర్లు, పంతంగి శ్రీనివాసరావు, బి.వెంకటేశ్వరరావు, ఎస్.సు రేష్, సిపిఐ సీనియర్ నాయకులు తూము కృష్ణయ్య, ఎస్.కె. నాగులు మీరా, ఎం.ఉదయ్, ఎస్.కె. సుభాని తదితరులు పాల్గొన్నారు.



## ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపు

తిరువూరు, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త : తిరువూరు పట్టణంలో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగింపు చర్యలు చేపట్టిన మున్సిపల్, పోలీస్ శాఖ దీర్ఘకాలంగా ఆక్రమణల కారణంగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు పోలీస్, మున్సిపల్ శాఖలు సంయుక్తంగా చేపట్టిన స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం దుకాణ సముదాయాల బోర్డులు, చొచ్చుకొచ్చిన ఆక్రమణలు తొలగించాలని షాపు యజమానులకు ఆదేశించారు. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు కారణంగా రోడ్డుపై నడుస్తూ పలువురికి ప్రమాదాలకు గురైన సంఘటనలు కోకొల్లలు పూర్తిస్థాయిలో ఆక్రమణల తొలగింపుతోనే ట్రాఫిక్ సమస్యకు చెక్ పడనుంది. ఈ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఆర్ నాగమల్లేశ్వరరావు, ఎస్సైలు ఎస్.శాతకర్ణి, రాజు పాల్గొన్నారు.



## సహకార సంఘాల సమస్యలపై ముఖ్యమంత్రిని కలిసిన నెట్టెం రఘురాం

వత్సవాయి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త : కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (కెడిసిసిబి) చైర్మన్ నెట్టెం రఘురాం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి, కేడీసీసీ బ్యాంక్ పరిధిలో పనిచేస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పాక్స్) మరియు వాటిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న కొన్ని సమస్యలు పరిపాలనా అంశాలపై పరిష్కారాన్ని కోరుతూ ముఖ్యమంత్రి వినతిపత్రం సమర్పించారు. కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ పరిధిలో పాక్స్ సంఘాల్లో సీఈఓ పోస్టులు ఖాళీగా ఉండటం వల్ల పరిపాలనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న అర్హులైన ఉద్యోగులకు ఒకసారి ప్రత్యేక ప్రమోషన్లను పరిశీలించవలసిందిగా ఆయన అభ్యర్థించారు. పలు గ్రామీణ పాక్స్ సంఘాలు డైలీ వేజ్ సిబ్బందిపై ఆధారపడి పనిచేస్తున్నాయని, అందువల్ల అర్హత పరీక్ష నిర్వహించి, అర్హులైన వారికి న్యాయబద్ధంగా అవకాశం కల్పించాలనే విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లారు. కేడీసీసీ బ్యాంక్ మరియు పాక్స్ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు విషయమై రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వర్తింపజేసిన విధంగా వీరికి కూడా పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచితే అనుభవజ్ఞులైన సిబ్బంది సేవలు మరింత కాలం అందుబాటులో ఉంటాయని తెలిపారు. కొన్ని వేతనాలు సస్పెన్స్ డ్యుటూ అకౌంట్ కింద నిల్వ ఉండటం వల్ల ఆర్థిక లావాదేవీల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వాటిని క్రమబద్ధీకరించేందుకు తగిన మార్గదర్శకాలు జారీ చేయవలసిందిగా ఆయన కోరారు. అదేవిధంగా అవసరమైన విద్యార్హతలు పొందేందుకు గతంలో ఇచ్చిన గడువును మరికొంత కాలం పొడిగిస్తే గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన ఉద్యోగులకు ఉపశమనం కలుగుతుందని, వారి ఉద్యోగ భద్రత కాపాడబడుతుందని అభ్యర్థించారు. ఈ వినతులన్నీ ఉద్యోగుల ప్రయోజనాలకే పరిమితం కాకుండా, గ్రామీణ సహకార వ్యవస్థ బలోపేతానికి, రైతులకు నిరంతర సేవలందించేందుకు దోహదపడతాయని నెట్టెం రఘురాం తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెట్టెం రఘురాం శ్రద్ధగా వినతిని విని, సంబంధిత శాఖలతో పరిశీలించి సాధ్యమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు.



## బుర్రకథ పితామహుడు నాజర్ జయంతి

గంపలగూడెం, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త : బుర్రకథ పితామహుడు పద్మశ్రీ షేక్ నాజర్ జయంతి పెనుగొలను షిరిడి సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో గురువారం జరిగింది. కమిటీ అధ్యక్షుడు ఊటుకూరు నారాయణ ఎరమల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎపి పోలీసు జీతాల ప్యాకేజీ కింద రూ.1.11 కోట్ల బీమా క్లెయిమ్ చెక్కు అందజేసిన బ్యాంక్ ఆఫ్ బరోడా

గుంటూరు, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త ప్రతినిధి: బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎపి పోలీసు శాఖ మధ్య కుదిరిన ప్రత్యేక జీత ఖాతా ప్యాకేజీ ఒప్పందం ప్రకారం ప్రమాదవశాత్తూ మరణం సంభవించిన సందర్భంలో ఉద్యోగులకు రూ.1 కోటి వరకు బీమా రక్షణ కల్పించబబుతోంది. ఇటీవల ఎపి ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కీర్తి వెంకట రాజు బ్యాంక్ ఆఫ్ బరోడా బాపట్ల శాఖ ఖతాదారుడు. 23 మే 2025న జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. 23 నవంబర్ 2023న కుదిరిన అవగాహన ఒప్పందం నిబంధనల మేరకు బ్యాంక్ తక్షణమే చర్యలు తీసుకుని మృతుని భార్య, నామినీ అయిన పెరుగు నన్నూరమ్మకు రూ.1.11 కోట్ల బీమీ క్లయిమ్ మొత్తాన్ని చెల్లించింది.. ఈ కార్యక్రమం మంగళగిరిలోని డిజిపి కార్యాలయంలో జరిగింది. అనంతరం డిజిపి హరీష్‌కుమార్ గుప్తా , బ్యాంకు ఆఫ్ బరోడా గుంటూరుప్రాంతీయ కార్యాలయ డిప్యూటీ జనరల్ మేనేజర్, రీజనల్ హెడ్ అనుపమ్ శ్రీవాస్తవ, హైదరాబాద్ డిఫెన్స్ బ్యాకింగ్ అడ్వైజర్ బ్రిగేడియర్ సంజయ్ కుమార్ ప్రసాద్ తదితరులు పాల్గొని చెక్కును అధికారికంగా అందజేశారు.



# ఆత్మకూరు దళిత కుటుంబాలకు చంద్రబాబు భరోసా
## - 115 కుటుంబాలకు రూ.కోటి 15 లక్షలు పంపిణీ

వెల్దుర్తి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: తల్లడిల్లిపోయిన దళిత హృదయాలకు ఏపీ సీఎం చంద్రబాబు భరోసా కల్పించారని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో దుర్గి మండలం ఆత్మకూరు గ్రామంలో విపరీతమైన కుల వివక్షను ఎదుర్కొని, గ్రామ బహిష్కరణకు గురై, ఐదేళ్లపాటు నానా వెతలు పడ్డ 115 మంది దళిత బాధితులకు ఒక్కొక్కరికి రూ.లక్షల చొప్పున గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో మొత్తం రూ. కోటి 15 లక్షలు నగదు చెక్కులను కూటమి ప్రభుత్వం ద్వారా అందించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జూలకంటి, ఎస్సీ కమిషన్ మెంబర్ మేకల భిక్షం (దాసు), దళిత నాయకులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమం సమయంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీఎస్ ఆంజనేయులు ఫోన్ ద్వారా బాధిత దళితులకు భరోసా కల్పించేలా తన సందేశాన్ని అందించారు. అనంతరం కార్యక్రమాన్నిఉద్దేశించి జూలకంటి మాట్లాడుతూ వైసీపీ హయాంలో దళిత బిడ్డలెందరో జగన్‌రెడ్డి ఊచకోతకు బలైపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఆత్మకూరు దళితులకు బాసటగా నిలుస్తోందని చెప్పారు. ఐదేళ్లపాటు వైసీపీ దౌర్జన్య పాలనలో ఆత్మకూరు దళితులు గ్రామాన్ని వదిలి ప్రత్యక్ష నరకం చవిచూశారన్నారు. ఆనాటి ప్రభుత్వంలో దళితులు పడ్డ ఇబ్బందులను ప్రత్యక్షంగా చూసిన చంద్రబాబు, తాము అధికారంలోకి రాగానే నష్టపోయిన ప్రతిఒక్కరిని పార్టీలకు అతీతంగా ప్రభుత్వం ద్వారా ఆదుకుంటామని ఇచ్చిన మాటకు కట్టుబడి ఉపాధి నిమిత్తం ఆర్థికసాయం అందించారని వివరించారు. గత ప్రభుత్వంలో దాదాపు 3 వేల మంది దళితులు చంపబడ్డారని, 3 లక్షలకుపైగా సామాజికంగా, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారని వాపోయారు. అన్నపూర్ణగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను గంజాయివనంలా మార్చి, డ్రగ్స్‌కు కేరాఫ్‌గా చేశారని విమర్శించారు. దళితులకు బలం, భరోసా కూటమి ప్రభుత్వంలోనే సాధ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఆత్మకూరు దళితుల ఉపాధికై సీఎం చంద్రబాబు అందించిన సాయానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.





**దళితులకు అండగా ఉంటాం: చీఫ్ విప్ జీవీ**

దళితులకు అండగా ఉంటామని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు వెల్లడించారు. దళితులకు నగదు చెక్కులు అందజేసే కార్యక్రమంలో ఆయన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డికి ఫోన్ చేసి, ఫోన్ ద్వారా దళితులకు ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మీ కోసం బ్రహ్మానందరెడ్డి ఎంతో పాటుపడ్డారని, కూటమి ప్రభుత్వం కూడా అనేక విధాలుగా మిమ్మల్ని ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉపాధికి ఆర్థికసాయం చేసిన సీఎం చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు.

**దళితుల హక్కులను కాపాడుతుంది: ఎస్సీ కమిషన్ మెంబర్ భిక్షం**

దళితుల హక్కులను కూటమి ప్రభుత్వం కాపాడుతోందని రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ మేకల బిక్షం (దాసు) చెప్పారు. వివక్షలు, అణచివేతలపై కమిషన్ పూర్తిస్థాయిలో బాధితుల పక్షాన నిలుస్తోందని వివరించారు. 2019 నుంచి ఆత్మకూరు దళితులు పడ్డ వెతలను గుర్తించి, ఆర్థికసాయం చేయడం పట్ల కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కళ్లం రామాంజిరెడ్డి, మాచర్ల మార్కెట్ యార్డు ఛైర్మన్ మధు, దుర్గి మార్కెట్ యార్డు ఛైర్మన్ లింగా బ్రహ్మయ్య, దుర్గి మండల పార్టీ అధ్యక్షులు జానకి రామయ్య, పార్టీ సీనియర్ నాయకులు మాగులూరి నారయ్య, మదార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి సమస్యకు పరిష్కార వేదిక ప్రజాదర్బార్: ఎమ్మెల్యే జూలకంటి

వెల్దుర్తి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: ప్రతి సమస్యకు పరిష్కార వేదిక ప్రజా దర్బార్ అని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పునరుద్ఘాటించారు. గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జూలకంటి అధ్యక్షతన నిర్వహించిన ప్రజాదర్బార్‌లో నియోజకవర్గ ప్రజల నుంచి వేర్వేరు సమస్యలపై అర్జీలను సమర్పించారు. వివిధ మండలాల నుంచి 33 మంది అర్జీలు అందించగా అందులో వైసీపీ హయాంలో కబ్జాకు గురైన భూములు, పలు రెవెన్యూ సమస్యలు, సివిల్ కేసులు పరిష్కరించాలని బాధితులు విన్నవించుకున్నారు. బాధితుల విన్నపాలను పరిశీలించి వీలైనంత త్వరగా సమస్యకు పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## చింతలతండాలో స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శిని

విజయపురిసౌత్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శిని కార్యక్రమం మాచర్ల మండలం చింతలతండా గ్రామంలో స్పెషల్ ఆఫీసర్, హౌసింగ్ ఏఈ మరియదాసు ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం, పరిశుభ్రత, పిల్లలు, పెద్దల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పోషకాహారం తీసుకోవాలని సూచించారు. చెడు అలవాట్లకు, ఫాస్ట్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలన్నారు. ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ వర్కర్లు, పంచాయతీ సిబ్బంది, స్కూల్ సిబ్బంది, డ్వాక్రా సిబ్బంది, గ్రామపెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## 777 వ రోజు భరతమాత అన్నప్రసాద వితరణ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణంలోని యానాది కాలనీలో, కోమెరపూడి గ్రామానికి చెందిన జంగా శ్రీనివాసరెడ్డి ధర్మపత్ని శ్రీలక్ష్మి గార్ల పెద్ద కుమారుడు జంగా వంశీ వెంకటరెడ్డి ధర్మపత్ని పూజిత గార్ల వివాహ వార్షికోత్సవ శుభ సందర్భంగా వీరి యొక్క, 6,000 రూపాయల ఆర్థిక సహాయంతో విందు భోజనం తరహా గా 121మందికి అందించటం జరిగింది. ఈ సందర్భంగా ఈనాటి దాతలు గతంలోనూ అనేక సందర్భాల్లో ఈ పథకంలో నిరుపేదల ఆకలి తీర్చారు. అలాగే ఈ రోజు అనగా గురువారం మధ్యాహ్నం 12.30నిముషాలకు ఈ సేవా కార్యక్రమం నిర్వహించడం జరిగింది, ఈ సందర్భంగా దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనాటి కార్యక్రమం దాతలకు వీరి కుటుంబ సభ్యులకు, ఈనాటి కార్యక్రమంలో సేవలు అందించిన దమ్మాలపాటి బాల వెంకటేశ్వర్లు కు, సరసమైన ధరకు రుచి మరియు శుచి కరమైన భోజనం అందించిన ఓగిబోయిన కొండలు కు హృదయ పూర్వక ధన్యవాదములు తెలిపారు.



## పరివర్తన..లో ఘనంగా కొరబండి వెరొనికమ్మ వర్ధంతి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త: ప్రస్తుత సమాజంలో నాగరికత పేరుతో మానవత్వం మంటకలుస్తున్న వేళా కొరబండి వెరోనికమ్మ ఏకైక కుమారుడైన కొరబండి ఆంథోనీ ఇరవై ఐదు సంవత్సరాలుగా తల్లి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించటం అభినందనీయమని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) పల్నాడు జిల్లా అధ్యక్షులు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది దాసరి జ్ఞానరాజు పాల్ లు మాట్లాడారు. గురువారం స్థానిక పరివర్తన మానసిక ఆశ్రమపాఠశాల్లో జరిగిన కొరబండి వెరోనికమ్మ 25 వ వర్ధంతి కార్యక్రమంలో వారు మాట్లాడారు. వెరోనికమ్మ కుమారుడు కొరబండి ఆంథోని, జిల్లెళ్ళ పాల్ రాజ్, రొంపిచర్ల పురుషోత్తం లు మాట్లాడారు. తొలుత కొరబండి వెరొనికమ్మ చిత్రపటానికి పలువురు పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం చిన్నారులకు అన్న సంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో షేక్. హైదర్, జెట్టి శేఖర్, ఇంటూరి మోహన్, కొరబండి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



## పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం




సత్తెనపల్లి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త: సత్తెనపల్లి మండలం భృగుబండ గ్రామంలో పౌష్టి కాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు తెలిపారు. "స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శిని" సభలో మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే పౌష్టికాహారం పెట్టాలని సూచించారు. పాఠశాలల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం పిల్లలకు బలవర్ధకమైన ఆహారం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ, ఆశా, ఆరోగ్య సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## వినుకొండ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం: జీ.వీ., మక్కెన
### ప్రభుత్వం నుంచి రూ.8.60 కోట్లు విడుదల

శావల్యాపురం,ఫిబ్రవరి5,ప్రభాతవార్త: నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. గురువారం మండలంలోని శానంపూడి గ్రామం నుంచి మతుకుమల్లి వరకు వెళ్లే మార్గంలో వాగుపై 40 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న కాజ్వే పనులకు డీసీసీబీ ఛైర్మన్ మక్కెనతో కలసి జీ.వీ ఘనంగా శంకుస్థాపన చేశారు. జీవీ మాట్లాడుతూ వర్షాకాలంలో వాగు పొంగి ప్రవహించడం



వల్ల శానంపూడి,మతుకుమల్లి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయి ప్రజలు,రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారని,ఈ కాజ్వే నిర్మాణంతో ఆ సమస్య శాశ్వతంగా తొలగిపోతుందని చెప్పారు. రూ. 40 లక్షల నిధులతో చేపట్టే ఈ నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని పనుల్లో నాణ్యత పాటించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామానికి బీటీరోడ్లు,డ్రైనేజీ,రవాణా సౌకర్యాలను మెరుగుపరచడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అలాగే వయ్యకల్లు గ్రామంలో రూ.50 లక్షల రూపాయల అంచనా వ్యయంతో లోలెవల్ బ్రిడ్జికి శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో రూ.8.60 కోట్ల నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల కనెక్టివిటీని పెంచుతున్నామని చెప్పారు. సీసీరోడ్లు,డ్రైన్లు,లోలెవల్ బ్రిడ్జిల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. వయ్యకల్లు గ్రామంలో రూ.18 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్లు నిర్మాణానికి,వినుకొండ మండలం విఠంరాజుపల్లి పిచికలపాలెం రోడ్డు నిర్మాణానికి రూ.3.40కోట్లు,గంటావారిపాలెం వెలమావారిపాలెం రోడ్డుకు రూ. 84 లక్షలు,ఈపూరు ఊడిజర్ల రోడ్డుకు రూ.1.కోట్లుతో సహా మొత్తంగా 5 రోడ్లకి రూ.8.60 కోట్ల రూపాయలు నిధులు ప్రభుత్వం విడుదల చేసినట్లు పేర్కొన్నారు.గ్రామాల్లో దశాబ్దాలుగా ఉన్న సమస్యలను పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వర్ణగ్రామ ఆరోగ్యదర్శిని కార్యక్రమం

వినుకొండ,ఫిబ్రవరి5,ప్రభాతవార్త: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని పెరుమాళ్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలో స్వర్ణగ్రామ ఆరోగ్యదర్శిని కార్యక్రమం గురువారం నిర్వహించారు. సర్పంచ్ లగడపాటి రవి మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్య సదుపాయాలు చేరువ చేయాల్సిన అవశ్యకత గుర్తించి కలెక్టర్ ఇటువంటి కార్యక్రమం ప్రారంభించడం హర్షణీయన్నారు. ప్రతినెలా మొదటి గురువారం తప్పని సరిగా స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శిని కార్యక్రమం జరుగుతుందని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడివో పుట్టారెడ్డి,మండల రిసోర్స్ కోఆర్డినేటర్ ప్రభాకరరావు,కార్యదర్శి ముల్లా అల్లీషా,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఆశా కార్యకర్త,అంగన్వాడీ కార్యకర్త, గ్రామపెద్దలు సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.



## స్వర్ణ గ్రామ ఆరోగ్యదర్శిని కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలి

నూజెండ్ల,ఫిబ్రవరి5,ప్రభాతవార్త: గ్రామస్థాయిలో ప్రజలకు ఆరోగ్య సేవలను మెరుగుపరచడం ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం జరుగుతుందని జిల్లా గ్రౌండ్ వాటర్ ఆఫీసర్ కె.రామబాలాజీ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో కలెక్టర్ ఆదేశాల మేరకు స్వర్ణ గ్రామ ఆరోగ్యదర్శిని కార్యక్రమం నిర్వహించారు. మండలకేంద్రమైన నూజెండ్లలో జరిగిన కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి పావులూరు ఉమాదేవి మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు,వ్యాధులనియంత్రణ,పారిశుధ్యంకు సంబంధించిన అవగాహన కల్పించడమే లక్ష్యంగా నెలలో ప్రతి మొదటి గురువారం స్వర్ణ గ్రామ ఆరోగ్యదర్శిని కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్య,వైద్య,అంగన్‌వాడి,పారిశుధ్య శాఖలపై సమీక్ష నిర్వహించి ప్రస్తుతం ఆ శాఖలు నిర్వహిస్తున్న కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జడ్డారామయ్య,ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు



## ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే ఆరోగ్యదర్శిని లక్ష్యం: జీ.వీ,మక్కెన

శావల్యాపురం,ఫిబ్రవరి5,ప్రభాతవార్త: ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే ధ్యేయంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని శానంపూడి గ్రామంలో నిర్వహించిన స్వర్ణ గ్రామ ఆరోగ్యదర్శిని కార్యక్రమానికి జీ.వీ,డీసీసీబీ మక్కెన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ శాఖల స్టాల్స్‌ను జీవీ స్వయంగా సందర్శించారు. అందుబాటులో ఉన్న వైద్య సేవలు,మందులు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం చేరువ చేయడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని,ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని,రుచికరమైన ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని అందుకోసం ఇంటి పెరటిలో కిచెన్ గార్డెన్ పెంచుకుని కూరగాయలు,ఆకుకూరలు పెంచుకోవాలని చెప్పారు.డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు,నాయకులు,తదితరులు పాల్గొన్నారు.



## నీటి సంఘాల సమావేశానికి భారీగా తరలిన కారంపూడి రైతులు

కారంపూడి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో అమరావతిలో గురువారం జరిగిన నీటి సంఘాల సమావేశానికి కారంపూడి నుంచి డీసీ ఛైర్మన్-4 పంగులూరి అంజయ్య ఆధ్వర్యంలో రైతులు భారీగా తరలివెళ్లారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి నీటి సంఘాల సభ్యులు, రైతులు వెళ్లారు. ఈ సందర్భంగా తహశీల్దారు వెంకటేశ్వర్లు నాయక్, పంగులూరి అంజయ్య జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ ఈ సమావేశానికి రైతులు వెళ్లేందుకు ప్రభుత్వం ఉచితంగా బస్సులను ఏర్పాటు చేసిందన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడానికి ఈ కార్యక్రమాన్ని సీఎం ఏర్పాటు చేశారని తెలిపారు.



## జీవనశైలి మార్పుతోనే ఆరోగ్యం: ఎంపీడీఓ

కారంపూడి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: జీవనశైలిలో మార్పుతోనే ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ గంటా శ్రీనివాసరెడ్డి, తహశీల్దారు వెంకటేశ్వర్లు నాయక్ అన్నారు. కారంపూడి మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ ఆరోగ్య దర్శిని కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం, ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండి జీవనశైలిలో మార్పులు చెందుతూ ఎదగాలన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## వైకాపా ఎస్సీసెల్ నాయకుడు అబ్రహం మృతి
### నివాళులర్పించిన మండల మాజీ కన్వీనర్ నక్కానాగిరెడ్డి
### మృతుని కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం

నూజెండ్ల,ఫిబ్రవరి5,ప్రభాతవార్త: మండలంలోని కంభంపాడు గ్రామానికి చెందిన వైకాపా ఎస్సీసెల్ నాయకులు పాలెపోగు అబ్రహం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న నూజండ్ల మండల వైకాపా మాజీ కన్వీనర్ నక్కానాగిరెడ్డి అబ్రహం పార్థివదేహానికి నివాళులర్పించి మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. కుటుంబసభ్యులకు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. వైకాపా నాయకులు,కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అన్ని విధాలుగా ఆదుకునేందుకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా జడ్పీ కో ఆప్షన్ మెంబర్ స్వేనోమ్,ఏఎంసి మాజీ వైస్ ఛైర్మన్ నరాలశెట్టి శ్రీనివాస్,బొల్లాపల్లి మండలం మాజీ జేసిఎస్ కన్వీనర్ అవినాష్ రెడ్డి,తెల్లమేకల రాజుయాదవ్,పసుపులేటి కొండలు,మారాసు కొండలు,తిరుమలశెట్టి శ్రీను,నీలం సతీష్, యు.కాశయ్య,కార్యకర్తలు,నాగిరెడ్డి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## సాగునీటి సంఘాల సమావేశానికి వినుకొండ నుంచి పయనం

వినుకొండ,ఫిబ్రవరి5,ప్రభాతవార్త: వినుకొండ నియోజకవర్గానికి చెందిన సాగు నీటి సంఘాల అధ్యక్షులు,ఉపాధ్యక్షులు కోసం అమరావతిలో నిర్వహించనున్న ఒకరోజు సమావేశానికి రాష్ట్ర జలవనరుల శాఖ ఆధ్వర్యంలో మూడు బస్సులు ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నీటి సంరక్షణ - భద్రత - భవిష్యత్తు అనే అంశంపై సాగు నీటి సంఘాల పాత్రపై దిశానిర్దేశం చేసే సమావేశం అమరావతిలో జరగనుంది. ఈ సమావేశానికి హాజరయ్యే సాగు నీటి సంఘాల ప్రతినిధుల కోసం ఎన్ఎస్పి గ్రౌండ్ నుండి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్ జీవీ మాట్లాడుతూ సాగునీటి నిర్వహణలో సాగు నీటి సంఘాల పాత్ర అత్యంత కీలకమని నీటి వనరుల సంరక్షణతోనే రైతుల భవిష్యత్తు సురక్షితమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు,సాగు నీటి సంఘాల సభ్యులు,కూటమి నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



## ప్రజాదర్బార్‌లో సమస్యలను స్వీకరించిన పూడా ఛైర్మన్ మధుబాబు

మాచర్ల, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: కష్టాల్లో ఉన్నవారికి టీడీపీ పార్టీ అండగా ఉంటుందని సమస్యల పరిష్కారం కోసం ప్రజాదర్బార్‌కు వచ్చిన ప్రజలు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, పూడా ఛైర్మన్ చిరుమామిళ్ల మధుబాబు భరోసా ఇచ్చారు. మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రజాదర్బార్‌కు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. మంత్రితోపాటు చిరుమామిళ్ల మధుబాబు గారిని కలిసి తమ సమస్యలు విన్నవించారు. త్వరితగతిన సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మధుబాబు హామీ ఇచ్చారు.



## బీసీవై పార్టీ పల్నాడు జిల్లా కన్వీనరుగా సైదులు



మాచర్ల, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: బీసీవై పార్టీ పల్నాడు జిల్లా కన్వీనరుగా గుండాల సైదులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ జిల్లాలో పార్టీ బలోపేతానికి బహుజన రాజ్య సిద్ధాంతానికి కట్టుబడి పని చేస్తానన్నారు. నూటికి 90 శృతం ఉన్న ఎస్సీ, ఎ స్టీ బీసీ, మైనార్టీల, అగ్రకుల సామాన్య ప్రజల అభివృద్ధే ధ్యేయంగా పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా రాష్ట్రంలో, పల్నాడు ప్రాంతంలో శక్తి వంచన లేకుండా పనిచేస్తానని, రాగద్వేషాలకు, మతాలకు, కులాలకు లోబడకుండా పనిచేస్తానని ప్రమాణం చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

## జమ్మలమడకలో స్వర్ణగ్రామ ఆరోగ్య దర్శిని

మాచర్ల, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: మాచర్ల మండలం అమ్మాని జమ్మలమడక గ్రామంలో స్వర్ణగ్రామ ఆరోగ్య దర్శిని కార్యక్రమాన్ని తహశీల్దారు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించారు. జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో ఆరోగ్య సిబ్బంది వివరాలు ఏర్పాటు చేశారు. స్పెషల్ ఆఫీసర్, తహశీల్దారు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం, ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.
రెవెన్యూ క్లినిక్ కార్యక్రమంలో భాగంగా జమ్మలమడక గ్రామానికి సంబంధించిన బాదే రామయ్య ఫిర్యాదును తహశీల్దారు కిరణ్‌కుమార్ పరిశీలించారు. బాధితుని పొలం వద్దకు వెళ్లి సమస్యను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు ఉన్నారు.





## ఏసీ టెక్నీషియన్లను ఆదుకోవాలంటూ ఎమ్మెల్యేకు వినతి

మాచర్ల, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: ఏసీ టెక్నీషియన్లుగా జీవనం సాగిస్తున్న వారిని గుర్తించి వారికి షాపుల నిర్మానానికి స్థలాన్ని కేటాయించాలని ఏసీ రిఫ్రిజిరేషన్ టెక్నీషియన్ల యూనియన్ ఉమ్మడి గుంటూరు జిల్లాల సలహాదారు దాసరి రమేష్ కోరారు. వెల్దుర్తి క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఏసీ టెక్నీషియన్లు కరోనా సమయం నుంచి కాలసం కలసిరాక పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పనిచేసుకోవడానికి షాపులు, ఉండటానికి ఇళ్లు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. దీనిపై ఎమ్మెల్యే జూలకంటి మాట్లాడుతూ స్థలాన్ని కేటాయించేలా అధికారులకు ఆదేశించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో షేక్ బాజీ, నరసింహారావు, సైదులు, షాకీర్, మీరావలి, పందు, జాకీర్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.



## కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుంది: ఎమ్మెల్యే జూలకంటి

మాచర్ల, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: కార్యకర్తల కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ పెద్దకొడుకులా అండగా ఉంటుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంరెడ్డి భరోసా ఇచ్చారు. గురువారం రెంటచింతల మండల పరిధిలోని మంచికల్లు గ్రామంలో ఆయన పర్యటించారు. టీడీపీ నాయకులు రావెల చెంచయ్య చౌదరి విద్యుత్తు షాక్‌తో మృతి చెందగా, ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలతో నివాళులర్పించారు. కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఇటీవల గ్రామంలోని ఎస్సీ కాలనీలో టీడీపీ కార్యకర్త బాసిపోగు మాణిక్యం పెద్దకుమారుడు రాంబాబు అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ గోగుల పుల్లారెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు యరపతినేని మట్టయ్య, శీలంనేని శివ, గోగుల వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాల్లో స్వర్ణ గ్రామ దర్శిని



పిడుగురాళ్ల, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త : మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో గురువారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు స్వర్ణ గ్రామ దర్శిని కార్యక్రమం నిర్వహించారు. అధికారులు గ్రామ దర్శిని కార్యక్రమంలో పాల్గొని ప్రజలు పలు సూచనలు చేశారు. ప్రతి నెలా మొదటి గురువారం అన్ని గ్రామ పంచాయతీలు గ్రామ దర్శిని నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆరోగ్యపరంగా హైరిస్క్ ఉనన్న వారిని గుర్తించి వారికి ఆరోగ్యంపై అవగాహన కల్పించి రానున్న రోజుల్లో ఆరోగ్యవంతులుగా చేయనున్నట్లు చెప్పారు. మండల ప్రత్యేకాధికారి ఆంజనేయులు బ్రాహ్మణ పల్లిలో జరిగిన గ్రామ దర్శిని కార్యక్రమంకు హాజరయ్యారు. అలాగే కోనంకి గ్రామంలో ఎంపీడీవో మొక్కపాటి నాగచంద్రకుమారి హాజరయ్యారు.

## లేబర్ కోడ్స్ రద్దు చేయాలి



పొన్నూరు, ఫిబ్రవరి 5,ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోర్సులను రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఈ నెల 12వ తేదీన నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులను, రైతులను కోరారు. కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ అమలులోకి వస్తే కార్మికులు ఆధునిక బానిసలుగా మారుతారన్నారు. కార్పోరేట్ల ప్రయోజనాల కోసం కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో కూడా కార్మికుల ప్రయోజనాలకు ఒక పైసా కూడా ఖర్చు చేయలేదన్నారు. ఈ బడ్జెట్లో 18రంగాలకు సంబంధించిన నిధులు తగ్గించారని అన్నారు. ఫిబ్రవరి 12న ఉదయం 10గంటలకు మండల కేంద్రాల్లో జరిగే నిరసన ప్రదర్శన, సమ్మెలో కార్మికులు, రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి.రమణ, నిమ్మకూరి రమేష్‌బాబు, జగన్నాధరావు, పి.సత్యనారాయణ, హనుమంతరావు, పాల్గొన్నారు.

## పట్టణాభివృద్ధే పురపాలక సంఘం ధ్యేయం



పొన్నూరు, ఫిబ్రవరి 5,ప్రభాతవార్త: పట్టణాభివృద్ధే ప్రధాన ఎజెండాగా పురపాలక సంఘం ముందుకు సాగుతుందని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో ఆయన గురువారం పర్యటించి జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పట్టణంలోని ప్రజలు ఎన్నో ఏళ్ళుగా కాలువలు, డ్రెయిన్ల లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలు సమస్యలను విన్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. నిర్మాణ పనులను పరిశీలించిన కమిషనర్ నాణ్యతకు ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పూర్తి అయ్యే విధంగా చూడాలన్నారు. వార్డు ప్రజల సమస్య తీరుతున్న దృష్ట్యా ఎమ్మెల్యే నరేంద్రకుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## సాగునీటిని పరిరక్షించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

పొన్నూరు, ఫిబ్రవరి 5,ప్రభాతవార్త: సాగునీటిని పరిరక్షించడమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని వ్యవసాయ మార్కెట్‌యార్డు డైరెక్టర్ చలమశెట్టి సీతారామయ్య అన్నారు. నీరు ప్రగతి-జలహారతి



కార్యక్రమంలో పాల్గొనేందుకు పొన్నూరు నుంచి నీటి సంఘాల నాయకులు ప్రత్యేక బస్సులో బయలు దేరి వెళ్ళారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగే సాగునీటి సంఘాల అధ్యక్షుల సమావేశానికి పొన్నూరు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలి వెళ్ళారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు సంబంధించిన ప్రయోజనాలను చేకూర్చడంలో మొదటి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

## 12న సమ్మెను జయప్రదం చేయండి

చేబ్రోలు(పొన్నూరు), ఫిబ్రవరి 5,ప్రభాతవార్త: ఈ నెల 12వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి హనుమంతరావు కోరారు. మండల కేంద్రమైన చేబ్రోలులో గురువారం జరిగిన జీవజాత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులకు అన్యాయం



చేస్తూ కార్పోరేట్ సంస్థలకు లాభం చేకూర్చేవిధంగా బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తుందని, వీటిపై ప్రతి ఒక్కరూ పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కూలీలకు లబ్ధి చేకూరే విధంగా ఉన్నటువంటి జాతీయ గ్రామీణ ఉపాధిహమీ పథకాన్ని ప్రభుత్వం అటకెక్కించడం ధారుణమన్నారు. తక్షణమే ఉపాధిహామీ పథకాన్ని పునరుద్ధరించాలన్నారు. కే ంద్ర ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వల్ల కూలీలు, రైతులు, కార్మికులు ఇబ్బందులు పడడంతోపాటు పెద్ద ఎత్తున నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం తమ మొండి వైఖరి మార్చుకోకపోతే దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ మస్తాన్‌వలి, జగన్నాథరావు, పి.సత్యనారాయణ, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## కళా నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించాలి

# -గెలుపు ఒక వాక్యం, ఓటమి ఒక పాఠశాల

**-విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య**

చేబ్రోలు(పొన్నూరు), ఫిబ్రవరి 5,ప్రభాతవార్త: ప్రతి విద్యార్థిలోనూ పుట్టుకతోనే ఏదో ఒక కళా నైపుణ్యం ఉంటుందని, దానిని గుర్తించి ప్రోత్సహించాలని ప్లేబ్యాక్ సింగర్, కంపోజర్, లిటిల్ మ్యూజిషియన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు డాక్టర్ కొమాండూరి రామాచారి కోరారు. చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న విజ్ఞాన్







మహోత్సవం గురువారం వైభవంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ కొమాండూరి రామాచారి మాట్లాడుతూ విద్యార్థి పరిపూర్ణతకు మూడు సూత్రాలు ముఖ్యమన్నారు. సైన్స్, ఫైన్ ఆర్ట్స్, స్పోర్ట్స్... ఈ మూడింటి కలయికే ఒక వ్యక్తిని సమాజంలో తిరుగులేని నాయకుడిగా నిలబెడుతుందని చెప్పారు. కేవలం పుస్తక పఠనం, సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే విద్యార్థిని ఉన్నతుడిగా తీర్చిదిద్దలేవని, సైన్స్-టెక్నాలజీతోపాటు లలిత కళలు, క్రీడలలో ప్రావీణ్యం ఉన్నప్పుడే ఒక విద్యార్థి పరిపూర్ణమైన వ్యక్తిగా ఎదుగుతాడన్నారు. ఈ మూడు రోజుల మహోత్సవాన్ని కేవలం గెలుపోటముల పోటీగా చూడవద్దని, ఇది విజ్ఞానాన్ని పంచుకోవడానికి, నేర్చుకోవడానికి ఒక అద్భుతమైన వేదిక అని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. విజ్ఞాన్స్ సంస్థ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఇస్తున్న ప్రాధాన్యతను ఆయన ప్రశంసించారు. దేశంలోని అన్ని విద్యాసంస్థలు ఇదే బాటలో పయనిస్తే, భారతదేశం విశ్వగురువుగా ఎదగడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఓటమికి తలవంచకండి....పోరాడి గెలవడమే అసలైన విజయం. పట్టుదలతో ప్రయత్నిస్తే సాధించలేనిది ఏదీ లేదు. అని విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు.

**గెలుపు ఒక వాక్యం....ఓటమి ఒక పాఠశాల: డాక్టర్ లావు రత్తయ్య**

విజ్ఞాన్ మహోత్సవ్ సందర్భంగా జరిగిన సభలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ క్రీడాకారులకు గెలుపు ఒక వాక్యం....ఓటమి అనేది ఒక పాఠశాల లాంటిదని చెప్పారు. ఆటలో గెలిచినవారికి శుభాకాంక్షలు చెప్పడం సహజమన్నారు కానీ ఓడిన వారినీ అభినందించడం చాలా ముఖ్యమన్నారు. ఎందుకంటే వారు ధైర్యంగా బరిలో నిలబడ్డారన్నారు. క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించారు. క్రీడలో గెలిచినా, ఓడినా, ఇద్దరికీ చప్పట్లు కొట్టాలి. అదే నిజమైన స్పోర్ట్స్ స్పిరిట్ అని తెలిపారు. ఒక మ్యాచ్ ఓడిపోవడం అంటే కెరీర్ ముగిసిపోవడం కాదన్నారు. అది కొత్త వ్యూహాలకు, కొత్త ఆలోచనలకు, కొత్త విజయాలకు మొదలు మాత్రమేనని అభిప్రాయపడ్డారు. సరిగ్గా 19ఏళ్ళ క్రితం విజ్ఞాన్స్ సంస్థ ఈ మహోత్సవ్‌ను ప్రారంభించిందని గుర్తు చేశారు. తనతోపాటు మరో వంద మంది నాయకులను తయారు చేసినప్పుడే నిజమైన నాయకత్వం సిద్ధిస్తుందన్నారు. అతిథిగా విచ్చేసిన రామాచారి వేలాది మందిని తీర్చిదిద్దడం ఇందుకు ఒక ఉదాహరణ అని పేర్కొన్నారు. జీవితంలో గెలుపోటములను సమానంగా స్వీకరించండి. ఓటమిని చూసి కుంగిపోవద్దు.....ఎదుకంటే ఓటమి అనేది విజయానికి పునాది రాయి వంటిదని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.

**పాల్గొనడమే అసలైన విజయం: సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి**

మరో అతిథి విజ్ఞాన్స్ సిఈవో డాక్టర్ మేఘన కూరపాటి మాట్లాడుతూ గెలుపు మాత్రమే ముఖ్యమైంది కాదు, పాల్గొనడమే అసలైన విజయమని చెప్పారు. విద్యార్థుల్లో స్ఫూర్తితోపాటు స్నేహ భావం కూడా పెంపొందాలనేది మా ఉద్దేశమన్నారు. ఈ వేడుకల్లో 80కిపైగా పోటీలు, వినోద కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రతి విద్యార్థి ఈ అనుభవాలను మధుర జ్ఞాపకాలుగా తీసుకెళ్ళాలని, ఇతర కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులతో మాట్లాడి, పరస్పరం పరిచయాలు పెంచుకొని, వారిని స్నేహితులుగా మార్చుకోవాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని, సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయని చెప్పారు.

**కొత్తవి నేర్చుకోవడానికి ఆలస్యం చేయరాదు: వీసి కేవీ క్రిష్ణకిషోర్**

జీవితంలో ఏవైనా కొత్తవి నేర్చుకునేందుకు ఆలస్యం చేయకూడదని విజ్ఞాన్స్ యూనివర్సిటీ ఇంచార్జి వీసి కేవీ క్రిష్ణకిషోర్ సూచించారు. జీవితంలో ప్రతి విద్యార్థి కూడా ఏదో ఒకటి సాధించేలా ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. విద్యార్థులు జీవితంలోని ప్రతి దశను, ప్రతి నిమిషాన్ని ఆస్వాదించి విజయతారాలకు చేరాలన్నారు. విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా యోగా, సంగీతం, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడంతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా పాల్గొనాలని సూచించారు. అనంతరం అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్‌ను చేశారు. విద్యార్థులు పిరమిడ్ వేసి ఉత్సాహపరిచారు. విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ పీఎంవీ రావు, అడ్వైజర్, మాజీ డీజీపీ మాలకొండయ్య, విజ్ఞాన్స్ లారా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఫణీంద్రకుమార్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాసబాబు, మహోత్సవ్ కన్వీనర్లు,, కోఆర్డినేటర్లు, డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించిన మున్సిపల్ కమీషనర్

తెనాలి మున్సిపాలిటీ ఫిబ్రవరి 5(ప్రభాతవార్త): 23 వ వార్డు రావి రవీంద్రనాథ్ కాలనీ, పరిసర ప్రాంతాల్లోమున్సిపల్ కమీషనర్ రామ అప్పలనాయుడు,ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మొవ్వ ఏసుబాబు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జగదీష్ పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రెండో లైన్లో కాలువలు శుభ్రం



చేసేందుకు అడ్డుగా ఉన్న నాపరాళ్ళు ఇతర ఆక్రమణలను జెసిబి ద్వారా తొలగించారు. కాలువలు తీసేందుకు ఇబ్బంది లేకుండా చూడాలని స్థానికులకు చెప్పారు. భవన నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలో కాలువ ఇసుక, మట్టితో పూడుకుపోవడాన్ని గమనించి సిబ్బంది చేత వెంటనే పూడిక తీయించారు . పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం వహించవద్దని సిబ్బందికి సూచించారు. ఇంటింటికి చెత్త సేకరణ కాలువలు శుభ్రం చేయించడం చెత్త తరలించడం వంటి విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ సిబ్బందిని ఆదేశించారు. కాలువల మీద వీధుల వెంబడి ఆక్రమణలు జరక్కుండా చూడాలని ప్లానింగ్ సెక్రటరీలను,టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించారు. రాజీవ్ గృహకల్ప అపార్ట్మెంట్ సమీపంలోఉన్న కల్వర్టు శుభ్రం చేయించారు.ఈ కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీలు,ప్లానింగ్ సెక్రటరీలు, పారిశుద్ధ్య,టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## బండారు వెంకటేశ్వర్లు వర్ధంతి సందర్భంగా అన్నదానం



తెనాలి మున్సిపాలిటీ ఫిబ్రవరి 5(ప్రభాతవార్త): పోలీస్‌అధికారిగా ఉన్నతమైన సేవలందిస్తున్న బండారు సురేష్ బాబు తండ్రి కీ.శే బండారు వెంకటేశ్వర్లు వర్ధంతి సందర్భంగా, పట్టణానికి చెందిన శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృందం సేవా సమితి అధ్యక్షులు కుర్రా శ్రీను పర్యవేక్షణలో,స్థానిక రైల్వే స్టేషన్ వద్ద గురువారం మధ్యాహ్నం,పేదలు, నిరాశ్రయులు,వికలాంగులకు బండారు వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బండారు వెంకటేశ్వర్లు ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ,సేవా సమితి సభ్యులు రెండు నిమిషాలు మోనం పాటించారు.ఈ అన్నదానం కార్యక్రమంలో,పి. శ్రీనివాసరావు,పొదుగు బ్రహ్మం,పొదుగు నాగేశ్వరరావు,డి. వీరరాఘవరావు,సిహెచ్. రాము మరియు శ్రీ శివ లింగేశ్వర స్వామి భక్త బృందం సేవాసమితి అధ్యక్షులు కుర్రా శ్రీను, సభ్యులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తెనాలి టౌన్ ఫిబ్రవరి5(ప్రభాతవార్త): విద్యుత్ లైన్ల మరమ్మత్తులు మరియు విద్యుత్ లైన్ లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలు తొలగింపు కారణంగా,తెనాలి రూరల్ మండల గ్రామాలైన చక్రాయపాలెం,చదలవాడ, కాకర్లమూడి గ్రామాల్లో ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, ఏపీసిపిడిసిఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బోరుగడ్డ అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ వారికి సహకరించవలసిందిగా మనవి చేస్తున్నామన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే వ్యవసాయ అభివృద్ధి : పూషడుపు కుమారస్వామి

చెరుకుపల్లి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త : రానున్న కాలంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుందడటంలో ఎలాంటి సందేహం లేదని టిడిపి సీనియర్ నాయకులు పొలిటికల్ మేనేజర్ పూషడుపు కుమారస్వామి అన్నారు. రాష్ట్ర



తెలుగుదేశం పార్టీ పిలుపుమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన అమరావతి నిర్వహిస్తున్న నీటి సంరక్షణ భద్రత భవిష్యత్తు కార్యక్రమానికి తరలి వెళ్లే సాగునీటి సంఘాల అధ్యక్ష ఉపాధ్యక్షుల ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. వెల్లటూరి ఛానల్ పరిధిలోని డిసి చైర్మన్, వైస్ చైర్మన్ నీటి సంఘాల అధ్యక్షులు ఉపాధ్యక్షులు చెరుకుపల్లి నుండి బయలుదేరి వెళ్లారు.ఈ కార్యక్రమంలో నీటి సంఘాల డిస్ట్రిబ్యూషన్ కమిటీ అధ్యక్షులు ఎర్రం శెట్టి వెంకట కరుణ శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ వెలగపూడి రవి ప్రసాద్, ఏఈ నీలం సువర్చల, విశ్వం శెట్టి శ్రీనివాసరావు, లచ్చి రామారావు ఛానల్ పరిధిలోని అధ్యక్షులు ఉపాధ్యక్షులు పాల్గొన్నారు. ప్రారంభించారు.

## నరేంద్ర వర్మ మాటంటే మాటే

నాడు మాట ఇచ్చారు నేడు చేసి చూపించారు అని బాపట్ల పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ గ్లోరి యానెట్ సొపాటి అన్నారు.గత ప్రభుత్వంలో పొన్నూరు చందోలు ప్రధాన



రహదారి గుంతలమయంగా ఉండి వర్షం వచ్చినప్పుడు జలమయమై ప్రజలు రాకపోకలకు చాలా ఇబ్బందులకు గురైయ్యేవారని తెలిపారు. ఆనాడు నరేంద్ర వర్మ ఆ రోడ్డు పరిస్థితిని ప్రజల అవస్థలను చూసి చలించి చాలా ఆవేదనతో ఎన్నికల తరువాత వచ్చేది మన ప్రభుత్వమేనని, ప్రభుత్వం ఏర్పడిన తరువాత వెంటనే రోడ్డు వేయించే బాధ్యత నాది అని ఆరోజు మాట ఇచ్చారని తెలిపారు. ఆ మాట ప్రకారం పొన్నూరు నుండి చందోలు వెళ్లే ప్రధాన రహదారి ని నిర్మిచడమే నిదర్శనమని, నరేంద్ర వర్మ మాటలు చెప్పరు పనులు చేసి చూపిస్తారు అనుటలో ఎలాంటి సందేహం లేదని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ గ్లోరి బాపట్ల శాసనసభ్యులు నరేంద్రవర్మ కు కృతజ్ఞతలు మరియు ధన్యవాదాలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

## పోలీస్ ప్రతిష్ట పెంచేలా పనిచేయాలి: ఎస్పీ ఉమామహేశ్వర్

బాపట్ల, ఫిబ్రవరి 5 (ప్రభాతవార్త):జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో సాయుధ పోలీసు బలగాల పాత్ర ఎంతో కీలకమని, వృత్తిపరమైన క్రమశిక్షణతో శాఖా ప్రతిష్టను ఇనుమడింపజేయాలని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ పరేడ్ మైదానంలో నిర్వహించిన"డీ మొబిలైజేషన్" ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పరేడ్ వాహనంలో ప్లటూన్లను పరిశీలించి, సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఏఆర్ సిబ్బందిలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఏటా మొబిలైజేషన్ నిర్వహిస్తామన్నారు. జనవరి 19న ప్రారంభమైన ఈ



శిబిరంలో జిల్లావ్యాప్తంగా 307 మంది సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు. 15 రోజుల పాటు వీరికి అత్యాధునిక ఆయుధాల వినియోగం, ఫైరింగ్, మాబ్ కంట్రోల్, వీఐపీ ఎస్కార్ట్, బీడీ టీమ్ విధులతో పాటు సర్వీస్ రూల్స్‌పై ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. మారుతున్న కాలానుగుణంగా టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సూచించారు.సిబ్బంది సంక్షేమమే మా ప్రాధాన్యపోలీసుల సంక్షేమానికి తమ శాఖ పెద్దపీట వేస్తోందని ఎస్పీ స్పష్టం చేశారు. "సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం ప్రతి శుక్రవారం"ఎస్పీ సంపర్క్, రెండో శనివారం"పోలీస్ సహచర ఓపెన్ హౌస్" నిర్వహిస్తున్నాం. ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా నా దృష్టికి తీసుకురావచ్చు" అని భరోసా ఇచ్చారు. అలాగే బాపట్లలో త్వరలోనే రాయితీ ధరలకే నిత్యావసరాలు అందించేలా పోలీస్ వెల్ఫేర్ క్యాంటీన్ అందుబాటులోకి తెస్తామన్నారు.

**హెల్మెట్ ధరించి ఆదర్శంగా నిలవండి..**

ప్రజలకు నీతులు చెప్పే పోలీసులు ముందుగా నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనాలపై వెళ్లే సిబ్బంది తప్పనిసరిగా హెల్మెట్ ధరించి సమాజానికి ఆదర్శంగా ఉండాలని ఎస్పీ సూచించారు. అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన పరేడ్ కమాండర్ అడ్మిన్ ఆర్ఐ షేక్ మోలుద్దీన్, ఇతర అధికారులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ డీఎస్పీ పి. జగదీష్ నాయక్, సీఐలు, ఏఆర్ అధికారులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో బాపట్ల ఏఎస్ఐ వెంకటరమణ కన్నుమూత

### నివాళులర్పించిన డీఎస్పీ జగదీష్ నాయక్, సీఐ రాంబాబు

బాపట్ల, ఫిబ్రవరి 5: ప్రభాత వార్త:బాపట్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న కె. వెంకటరమణ (57) గుండెపోటుతో అకాల మరణం చెందారు. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో తెనాలిలోని హరిత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో పోలీస్ శాఖలో విషాద ఛాయలు అలముకున్నాయి. గురువారం పొన్నూరు మండలం గాయంవారి పాలెంలోని నివాసంలో ఉంచిన ఆయన పార్థివ దేహానికి బాపట్ల సబ్ డివిజన్ ఇన్‌చార్జ్ డీఎస్పీ పి. జగదీష్ నాయక్, పట్టణ సీఐ ఆర్. రాంబాబు, ఇతర అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.పోలీస్ శాఖకు తీరని లోటువెంకటరమణ 1990లో కానిస్టేబుల్‌గా పోలీస్ శాఖలో చేరారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు స్టేషన్లలో సమర్థవంతంగా విధులు నిర్వహించి, ఏఎస్ఐగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం బాపట్ల పట్టణ స్టేషన్‌లో పని చేస్తూ అందరితో స్నేహపూర్వకంగా ఉండేవారనారుఅండగా ఉంటాం: జిల్లా ఎస్పీఏఎస్ఐ వెంకటరమణ మృతి పట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. "పోలీస్ యూనిఫామ్ ధరించిన వారంతా ఒకే కుటుంబం. వెంకటరమణ గారి మరణం మా కుటుంబ సభ్యుడిని కోల్పోవడమే" అని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి పోలీస్ శాఖ అన్ని విధాలా అండగా ఉంటుందని, ప్రభుత్వ పరంగా అందాల్సిన ప్రయోజనాలు త్వరితగతిన అందేలా చూస్తామని ఎస్పీ భరోసా ఇచ్చారు. అధికార లాంఛనాలతో అంతిమ యాత్రఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు అధికార లాంఛనాలతో వెంకటరమణ అంత్యక్రియలు నిర్వహించారు. మట్టి ఖర్చుల నిమిత్తం తక్షణ సహాయంగా రూ. 1,00,000/ నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం గాయంవారి పాలెం సమీపంలోని స్మశాన వాటికలో గాలిలోకి తూటాలు పేల్చి ఏఎస్ఐకి కడసారి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పోలీస్ సిబ్బంది, స్థానికులు పాల్గొని అశ్రునయనాలతో నివాళులర్పించారు.

## ప్రతి ఇంటికి మంచినీరు అందిస్తాం: కొనకాల రవి కిరణ్



చెరుకుపల్లి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త : గ్రామపంచాయతీ పరిధిలో ప్రతి ఇంటికి త్రాగునీరు అందించేందుకు త్వరితగతిన చర్యలు చేపట్టనున్నట్లు గ్రామపంచాయతీ సర్పంచ్ కొనకాల నాగమల్లేశ్వరి తనయుడు కొనకాల రవి కిరణ్ తెలిపారు. గురువారం బలుసుల పాలెం గ్రామపంచాయతీ పరిధిలో మెట్ట గౌడ పాలెం, గంజిరబోయిన వారిపాలెం, పొదిలివారిపాలెం, ఆట్ల వెంకటరెడ్డి పాలెం ప్రాంతాల్లో ఆయన పర్యటించి త్రాగునీటి సరఫరా పై స్థానికలతో సమీక్ష జరిపారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా త్వరలో ప్రతి ఇంటికి త్రాగునీరు అందే విధంగా కార్యాచరణ రూపొందించినట్లు ఆయన గ్రామస్తులకు తెలిపారు.

## నేడు మండలంలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

చెరుకుపల్లి ,ఫిబ్రవరి 5, ప్రభాతవార్త : నేడు మండలంలోని ఆరంబాక రాజవోలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్ సోదరుడు శివప్రసాద్ శంకుస్థాపన చేయనున్నట్లు మండల పార్టీ అధ్యక్షులు తాత ఏడుకొండలు గురువారం ప్రకటనలో తెలిపారు. ఆరంబాక గ్రామ స్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మాణానికి, రాజవోలు గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపన చేయనున్నట్లు కార్యక్రమంలో పార్టీ నాయకులు ,కార్యకర్తలు పాల్గొనవలసిందిగా తాత ఏడుకొండల తెలిపారు.

## విఆర్‌వోల సంఘం కోశాధికారిగా శివరామకృష్ణ



భట్టిప్రోలు(రేపల్లె), ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:భట్టి ప్రోలు మండలంలోని వెల్లటూరు విఆర్‌వో పోతార్లంక వెంకట శివరామకృష్ణ రేపల్లె డివిజన్ స్థాయి విఆర్‌వోల సంఘం కోశాధికారిగా ఎన్నికయ్యారు.బాపట్ల జిల్లా కమిటీలో భట్టిప్రోలు మండలం తరపున జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా పెదపులివర్రు విఆర్‌వో చిట్టిబాబు ఎన్నికయ్యారు.గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శివరామకృష్ణ,చిట్టిబాబులను మండల ఇన్‌ఛార్జి ఆర్ఐ మంద్రు జక్రయ్య,విఆర్‌వోల సంఘం అధ్యక్షుడు పి.కాళీకృష్ణ,విఆర్‌వోలు సిహెచ్.రవికుమార్,ఎన్ .లక్ష్మి,ఎల్.సురేష ,సిహెచ్.పుల్లయ్య,ఎ.ప్రసాద్,అబ్దుల్ కరీం బేగ్ తదితరులు అభినందించారు.

## జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం అమలు చేయాలి

రేపల్లె, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:వ్యవసాయ కూలీల ఉపాధిని దెబ్బతీస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీ రామ్ జీ నూతన చట్టాన్ని రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని అమలు చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి సిహెచ్.మణిలాల్ డిమాండ్ చేశారు.గురువారం



సిపిఎం ఆధ్వర్యంలో రేపల్లె మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 2025 నూతన గ్రామీణ ఉపాధిచట్టం పేదల పని హక్కును హరించివేస్తున్నదన్నారు.మహాత్మా గాంధీ ఉపాధిహామీ చట్టం వలన గ్రామీణ కూలీలకు పని భరోసా,మహిళలకు సమాన వేతనం,వలసల తగ్గింపు సాధ్యపడిందని ఆయన గుర్తుచేశారు.కేంద్ర ప్రభుత్వమే 90 శాతం నిధులను కేటాయించేదన్నారు.నూతన చట్టంలో కేంద్రం వాటా తగ్గించి రాష్ట్రాలపై భారం మోపడం ద్వారా పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర,జాబ్ కార్డుల రద్దు,ఆధార్,కేవైసీ పేరుతో కోట్లాది మంది కూలీలను పనుల నుంచి కుదించే ప్రక్రియ వలన అనేక మంది నష్టపోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.పంట కోతల సమయంలో 60 రోజులు సీలింగ్ విధించడం విచారకరమన్నారు.గతంలో రాష్ట్రంలో జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ వంద రోజులు పని పొందేవారన్నారు.గతంలో కేంద్ర ప్రభుత్వం 90 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 10 శాత నిధులిచ్చి అన్ని సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకునేవన్నారు. 2005 చట్టాని న్ మరింత బలోపేతం చేయాలని ఆయన కోరారు.మండల ఆర్ఐ రాంబాబుకు వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం,ప్రజాసంఘాల నాయకులు కె.గోపి,కె.ఆశీర్వాదం,సిహెచ్.ప్రకాష్,కె.నాంచారమ్మ,రత్నబాబు,వి.ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య ప్రమాణాలను పరిరక్షించుకోవాలి

రేపల్లె, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:ఆరోగ్య ప్రమాణాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై



ఉందని పట్టణంలోని బాలయోగి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్.మాధవి అన్నారు.స్పర్శ కార్యక్రమంలో భాగంగా లెప్రసీ విభాగం ఆధ్వర్యంలో గురువారం కుష్టు వ్యాధి నిర్మూలన అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశలోనే కుష్టు వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు.బ్యాక్టీరియా వల్ల చర్మం,నరాలు,కళ్ళు,శ్వాసనాళాలపై ప్రభావం చూపే దీర్ఘకాలిక అంటువ్యాధి అనే విషయం గుర్తుంచుకోవాలన్నారు.చర్మంపై రంగు మారిన మచ్చలు లేతగా,ఎర్రగా,రాగి రంగులో కనిపిస్తుంటాయని ఆమె వివరించారు.చర్మపు మచ్చలు ఉన్న ప్రదేశంలో స్పర్శ తెలియదన్నారు.చేతులు, కాళ్ళలో తిమ్మిరి,బలహీనత,మొద్దుబారడం వంటి లక్షణాలు కనిపిస్తాయని ఆమె చెప్పారు.చర్మం పొడిబారడం,గడ్డలు లేదా మందపాటి చర్మం ఏర్పడటం,కను రెప్పలు మూసుకుపోవడం,దృష్టి సమస్యలు చోటుచేసుకుంటాయని తెలిపారు.95 శాతం మందికి రోగనిరోధక శక్తి ఉండటం వలన కుష్టువ్యాధి రాదన్నారు.అదేవిధంగా ఈ వ్యాధికి చికిత్స అందుబాటులో ఉందని మాధవి వివరించారు.ఈ వ్యాధికి ప్రభుత్వ వైద్యశాలల్లో ఉచిత చికిత్స లభిస్తున్నదన్నారు. ప్రారంభంలోనే గుర్తిస్తే వైకల్యాన్ని నివారించవచ్చున్నారు.అంటువ్యాధి అయినందున సకాలంలో చికిత్స తీసుకోవడం ద్వారా సామాజిక వివక్షను తొలగించవచ్చునని ఆమె పేర్కొన్నారు. జి.చక్రధరరావు, వైద్య సిబ్బంది,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామాలలో రహదారులకు మహర్దశ

నగరం,ఫిబ్రవరి5,ప్రభాతవార్త: గ్రామాలలో రహదారులకు మహర్దశ కలిగిందని టీడీపీ నాయకులు



అనగాని శివప్రసాద్ అన్నారు.గురువారం స్థానిక మండల పరిధిలోని కొలగానివారిపాలెం పంచాయితీలో వడ్డేవారిపాలెం,నాగిశెట్టివారిపాలెం గ్రామాలలో 20లక్షల నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రోడ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయని,గత ప్రభుత్వంలో ఒక్క రోడ్డు కూడవేయలేదని ,ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బొర్రా శ్రీనివాసరావు,రేపల్లే నియోజకవర్గ జనసేన పీఓసి మత్తి బాస్కరావు, జడ్పీటీసీ సభ్యులు మన్యం నాగలక్ష్మి,సర్పంచ్ భీమా శ్రీనివాసరావు,టీడీపీ మండల అధ్యక్షులు చింతల సుబ్బారావు ,గ్రామనాయకులు ,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ లైన్లకు మరమ్మతులు

రేపల్లె, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:పట్టణంలోని 11 కెవి 5వ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్లు మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డిప్యూటీ ఇఇ శ్యామ్ సుధాకరబాబు గురువారం తెలిపారు.పేటేరు రోడ్డు,అంకమ్మ చెట్టు సెంటర్,పెద్ద మసీదు ఏరియా,ప్రభుత్వ వైద్యశాల ఎదురు రోడ్డు,తాలూకా కార్యాలయాలు,రైల్వే స్టేషన్ రోడ్డులో విద్యుత్ సరఫరాకు అంతరాయమేర్పడుతుందని చెప్పారు.

# అసంఘటిత కార్మికులకు సంక్షేమ పథకాల పునరుద్ధరణ

**కార్మికులకు ఆధునిక నైపుణ్యాల్లో శిక్షణ . సంజీవనితో అనుసంధానించి వైద్య పరీక్షలుకార్మిక శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు**

గుంటూరు, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త ప్రతినిధి: అసంఘటిత రంగంలో ఉన్న భవన నిర్మాణ, ఇతర కార్మికులకు గతంలో అందించిన సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రసూతికి రూ.20 వేలు, వివాహానికి రూ.40 వేలు, సహజ మరణానికి రూ.60 వేలు, అంత్యక్రియలకు రూ.20 వేల మేర ఆర్థిక సాయం అందించేలా చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. క్యాంపు కార్యాలయంలో గురువారం కార్మికశాఖపై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి అసంఘటిత రంగంలో ఉన్న కార్మికుల్లో ఆధునిక నైపుణ్యాలను, జీవన ప్రమాణాలను పెంచే అంశంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. నిర్మాణ రంగంలో ఉన్న ప్రముఖ కంపెనీలు ఎల్ అండ్ టీ, ఎన్సీసీ, మిట్టల్ సహా వేర్వేరు సంస్థల సహకారంతో వారికి అవసరమైన నైపుణ్య శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆధునిక నైపుణ్య శిక్షణ ద్వారా ఏపీలోని కార్మికులు దేశ విదేశాల్లోని ఉపాధి అవకాశాలను దక్కించుకుని అధిక ఆదాయాన్ని ఆర్జించేలా చూడాలని సూచించారు. జిల్లాల వారీగా, రంగాల వారీగా కార్మికుల డేటా బేస్ ను రూపొందించాలని.. వారిలో నైపుణ్యాల స్థాయిని అంచనా వేయాలని ముఖ్యమంత్రి కార్మిక శాఖకు నిర్దేశించారు. నైపుణ్యం పోర్టల్ ద్వారా ఈ డేటా బేస్ ను అనుసంధానించటంతో పాటు కార్మికులు లేటరల్ ఎంట్రీ ద్వారా వివిధ కోర్సులు అభ్యసించి ఉన్నత విద్యార్హతను సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిగ్ వర్కర్లు, నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల ఆదాయాలు గణనీయంగా పెరిగేందుకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. సిమ్యులేషన్ ల్యాబ్స్ సహా ఆధునిక శిక్షణ నైపుణ్యాల ద్వారా ఉత్పాదకత పెంచే అంశంపై ప్రణాళికలు రూపొందించాలన్నారు. వివిధ రంగాలకు అవసరమైన ఆధునిక పనిముట్లను కూడా కార్మికులకు అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. ఏపీలో ఉన్న కార్మికుల్లో సాంకేతిక పరమైన నైపుణ్యాలు పెరిగితే అధిక ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలోని 20 లక్షల మంది కార్మికులకు నైపుణ్యాలు పెంచేందుకు అనువుగా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో స్కిల్డ్ లేబర్ ను తయారు చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. రాష్ట్రంలో ఏర్పాటు కానున్న వివిధ భారీ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కూడా మన యువతకు అవసరమని ఆయన అన్నారు. అసంఘటిత రంగంలోని కార్మికులను మైక్రో ఎంట్రప్రెన్యూర్లగానూ ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్నవారిని గుర్తించాలన్నారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ తో పాటు కార్మిక శాఖ ద్వారా రూ.2.5 లక్షల వరకూ ఉచిత వైద్య చికిత్సలు ఆపై ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా భరించేలా చూడాలని స్పష్టం చేశారు. గతంలో కార్మికుల సంక్షేమం కోసం కన్‌స్ట్రక్షన్ వర్కర్ వెల్ఫేర్ ఫండ్‌ను టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి గుర్తు చేశారు.

